సాక్షి
ఆదిలాబాద్
శనివారం । 12 । అక్టోబర్ । 2024

'గూడు' కబురు

- ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపికకు ప్రత్యేక కమిటీలు
- శనివారంలోగా పూర్తి చేయాలని ఆదేశం
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

జిల్లాలోని పంచాయతీలు	473
మున్సిపల్ పరిధిలోని వార్డులు	49
జిల్లాకు మంజూరైన గృహాలు	7,400

కైలాస్‌నగర్: సొంత ఇంటిస్థలం కలిగి పక్కా ఇళ్లు లేనటువంటి నిరుపేదలకు రాష్ట్ర ప్రభుత్వం తీపికబురు అందించింది. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి అర్హులైన లబ్ధిదారుల ఎంపిక కోసం ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేయాలని పేర్కొంటూ జీవో నంబర్ 33 పేరిట శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. గ్రామీణ ప్రాంతాల్లో ఎంపీడీవో లు, మున్సిపల్ పరిధిలో కమిషనర్ల ఆధ్వర్యంలో శ నివారంలోగా ఏర్పాటు చేయాలని ఆదేశించింది. సర్కారు నిర్ణయంపై పేదల్లో హర్షం వ్యక్తమవుతోంది.

జిల్లాకు 7,400 ఇళ్లు

గ్రామీణ, మున్సిపల్ ప్రాంతాల్లో ఇంటిస్థలం ఉండి పక్కా ఇళ్లు లేనటువంటి నిరుపేదల సొంతింటి కల సాకారం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం నియోజకవర్గానికి 3500 చొప్పున ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాలకు 7వేల ఇళ్లను మంజూరు చేసింది. అలాగే ఆసిఫాబాద్ నియోజకవర్గంలోని గాదిగూడ, నార్నూర్, ఖానాపూర్ నియోజకవర్గంలోని ఉట్నూర్, ఇంద్రవెల్లి మండలాలకు సంబంధించి 400ఇళ్లను కేటాయించింది. వీటికి సంబంధించిన లబ్దిదారులను ఎంపిక చేయాల్సి ఉంది.

ప్రత్యేక కమిటీల నియామకం ..

లబ్ధిదారుల ఎంపిక కోసం పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేయాలంటూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గ్రామాల్లో సర్పంచ్/స్పెషల్ ఆఫీసర్ చైర్మన్‌గా, ఇద్దరు స్వయం సహాయక సంఘాల మహిళలు, గ్రామాభివృద్ధికి పాటుపడే ముగ్గురు స్థానిక వ్యక్తులు ఉండాలని సూచించింది. అందులో ఎస్సీ, ఎస్టీ, బీసీ కులాల్లోని ఒకరు చొప్పున ఎంపిక చేయాలని ఆదేశించింది. అలాగే మున్సిపల్ పరిధిలో వార్డు కౌన్సిలర్ చైర్మన్‌గా ఉండగా ఇద్దరు స్వయం సహాయక సంఘాల మహిళలు, వార్డు అభివృద్ధికి తోడ్పడే ఎస్సీ, ఎస్టీ, బీసీ కులానికి చెందిన మరో ముగ్గురిని నియమించాలని సూచించింది. ఈ కమిటీల ఎంపికను శనివారంలోపు పూర్తి చేయాలని ఆదేశించింది. గ్రామీణ ప్రాంతాల పరిధిలో ఎంపీడీవో, పట్టణ పరిధిలో మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో ఎంపిక బాధ్యతలను అప్పగించింది. అయితే పండగ నేపథ్యంలో శనివారంలోపు ఏ విధంగా కమిటీలను పూర్తి చేస్తారనేది ప్రశ్నార్థకంగా మారనుంది.

ఉత్తర్వులు అందాయి

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేయాలంటూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు అందాయి. శనివారంలోగా ఈ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించింది.

– బసవేశ్వర్, హౌసింగ్ నోడల్ అధికారి

మద్దతుపైనే ఆశలు



ఆరబెట్టిన సోయా పంట

- దసరా..రైతు దశ మార్చేనా
- ఇళ్లకు చేరిన పంట దిగుబడులు
- విక్రయానికి సిద్ధం చేస్తున్న అన్నదాత

సాక్షి,ఆదిలాబాద్: దశమి వచ్చింది.. తమ దశను మారుస్తుందా అని రైతులు గంపెడాశతో ఎదురుచూస్తున్నారు. ఆరుగాలం శ్రమించి పండించిన పంట దిగుబడులు ప్రస్తుతం లోగిళ్లకు చేరుతున్నాయి. ఈ పరిస్థితుల్లో మార్కెట్లో మద్దతు ధరపై రైతులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. దీపావళి సమయానికి తమ చేతికి డబ్బులు రావాలని, పెట్టుబడి కోసం చేసిన అప్పులు తీర్చేలా, ఇంటి ఖర్చులు సరిపోయేలా ఉండాలని కోరుకుంటున్నారు.

సోయా రైతు కష్టాలు..

జిల్లాలో పత్తి తర్వాత అత్యధికంగా సాగయ్యేది సోయాబీన్. ఈ వానాకాలంలో 24,301మంది రైతులు 65,306 ఎకరాల్లో సోయా సాగు చేశారు. సుమారు 5,00,920 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అంచనా. ఇదిలా ఉంటే ఈనెల 4న సోయా కొనుగోళ్లు జిల్లాలో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో మొదలయ్యాయి. మద్దతు ధర క్వింటాలుకు రూ.4,892 ఉంది. ఇక్కడివరకు బాగానే ఉన్నా.. పంట దిగుబడుల కొనుగోలులోనే అభ్యంతరాలు వస్తున్నాయి. ప్రధానంగా క్రాఫ్ బుకింగ్ ఆధారంగా మార్క్‌ఫెడ్ కొనుగోలు చేస్తుండగా, రైతుకు సంబంధించి ఎకరానికి 6.52 క్వింటాళ్లను మాత్రమే పరిగణలోకి తీసుకొని కొనుగోలు చేస్తున్నారు. అయితే ఎకరానికి 8 నుంచి 10 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. ఈ నేపథ్యంలో రైతు పూర్తి దిగుబడిని మద్దతు ధరకు అమ్ముకోలేని పరిస్థితి. మరోవైపు ప్రైవేట్‌లో క్వింటాలుకు రూ.4,200 వరకే చెల్లిస్తున్నారు. ఈ క్రమంలో సోయా రైతులో ఆందోళన వ్యక్తమవుతోంది.

పత్తి ధరపై బెంగ..

ఈ సీజన్‌లో జిల్లాలో 4లక్షల 21వేల 815 ఎకరాల్లో పత్తి సాగైంది. ఎకరాకు 6 నుంచి 8 క్వింటాళ్లు వస్తుందని వ్యవసాయ శాఖ అంచనా. మరోవైపు కేంద్రం క్వింటాలుకు రూ.7,521 మద్దతు ధర ప్రకటించింది. ప్రస్తుతం రాష్ట్రంలోని వివిధ మార్కెట్లలో మద్దతు ధరలోపే పత్తి రేటు పలుకుతుంది. జిల్లాలో పత్తి కొనుగోళ్లు త్వరలో ప్రారంభం కావాల్సి ఉంది. ప్రైవేట్ వ్యాపారులతో పాటు సీసీఐ కూడా రంగంలో ఉంటే తమకు మద్దతు ధర లభిస్తుందన్న ఆశలో రైతులు ఉన్నారు.

మద్దతు ధరతో కొనాలి..



మార్కెట్లో పత్తి కొనుగోళ్లు త్వరగా ప్రారంభమైతే నాలాంటి రైతులకు మేలు జరుగుతుంది. చేతిలో డబ్బులు లేకపోవడంతో పండుగ జరుపుకోలేని పరిస్థితి ఉంది. ప్రభుత్వరంగ సంస్థ రైతులకు అండగా నిలవాలి. మద్దతు ధరతో కొనుగోలు చేయాలి.

– జి.బుచ్చన్న, రైతు, లింగి గ్రామం, తలమడుగు మండలం

అప్పు తీర్చాల్సి ఉంది..



పత్తి, మొక్క జొన్న సాగు చేశాను. పంటలు కోతకు వచ్చాయి. పెట్టుబడి కోసం రూ.7లక్షలు దాకా అప్పయింది. మద్దతు ధర లభిస్తే అప్పులు పోనూ ఖర్చులకు మిగులుతాయి.

– చట్ల విలాస్, రైతు, బజార్‌హత్నూర్

రైతుకు న్యాయం చేయాలి



నేను ఏడెకరాల్లో పత్తి సాగు చేశాను. దిగుబడులపై ఎన్నో ఆశలు పెట్టుకున్నా. రూ.2లక్షల 20వేల వరకు అప్పయింది. పంటకు మద్దతు ధర లభిస్తేనే నాకు గిట్టుబాటు అవుతుంది. యంత్రాంగం రైతుకు న్యాయం చేసేలా మార్కెట్లో అనువైన పరిస్థితులు కల్పించాలి.

– గడ్డం సురేందర్ రెడ్డి, రైతు, తాంసి



బయోమెట్రిక్ డివైస్‌ను అందజేస్తున్న కలెక్టర్

బయోమెట్రిక్ యంత్రాలొచ్చాయ్..

కై లాస్‌నగర్: జిల్లాలోని తహసీల్దార్లకు ప్రభుత్వం అధునాతన బయోమెట్రిక్ యంత్రాలను అందజేసింది. ధరణి ద్వారా భూముల రిజిస్ట్రేషన్లతో పాటు భూ వ్యవహారాలను తహసీల్దార్లు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. అధికారుల అథెంటికేషన్, సిగ్నేచర్ల ఫోర్జరీకి అవకాశం లేకుండా ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం అధునాతన బయోమెట్రిక్ మిషన్ల పంపిణీకి శ్రీకారం చుట్టింది. జిల్లాలోని 18 మండలాల తహసీల్దార్లకు కలెక్టర్ రాజర్షి షా శుక్రవారం అందజేశారు.




ఆదిలాబాద్ మున్సిపల్ పరిధి గ్రీన్‌వ్యాలీలోని శ్రీత్రిశక్తి దుర్గామాత ఆలయంలో మహానవమి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వేద పండితులు ప్రవీణ్ ఆధ్వర్యంలో యాగం చేపట్టారు. అమ్మవారు సిద్ధిధాత్రి అవతారంలో దర్శనమిచ్చారు. – ఆదిలాబాద్



దసరాకు సర్వం సిద్ధం

దసరా మైదానంలో ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది

ఆదిలాబాద్: నేడు విజయదశమి వేడుకలకు సర్వం సిద్ధం అయింది. దసరా ఉత్సవాల సందర్భంగా జిల్లా కేంద్రంలోని దస్నాపూర్‌లో గల దసరా మైదానంలో హిందూ సమాజ్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. రావణ దహన కార్యక్రమానికి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు సమితి ప్రతినిధులు పేర్కొన్నారు.



తాగునీటి తిప్పలు తప్పేలా..



ఆదిలాబాద్ రూరల్ ఎంపీడీవో కార్యాలయంలో మంచినీటి సహాయకులకు శిక్షణ అందిస్తున్న ట్రైనర్ (ఫైల్)

- నీటి సరఫరాకు ఇబ్బందుల్లేకుండా ప్రభుత్వ చర్యలు
- పంచాయతీలకు మంచి నీటి సహాయకుల ఎంపిక
- జిల్లాలో 480 మంది మల్టీపర్పస్ హెల్త్ వర్కర్లకు శిక్షణ
- వచ్చే నెల నుంచి అందుబాటులోకి సేవలు

కై లాస్‌నగర్: జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మిషన్ భగీరథ ద్వారా నీటి సరఫరా చేపడుతున్నారు. ఆయా పంచాయతీల ఆధ్వర్యంలో తాగునీటిని అందిస్తుండగా విద్యుత్ మోటార్లు కాలిపోవడం, పైపులైన్ల లీకేజీలు, చేతిపంపుల మరమ్మతులు వంటి సమస్యలు తరచూ తలెత్తుతున్నాయి. వాటిని పరిష్కరించేందుకు మెకానిక్‌లు అందుబాటులో ఉండటం లేదు. ఫలితంగా రోజుల తరబడి తిప్పలు తప్పట్లేదు. దీన్ని గుర్తించిన ప్రభుత్వం ఈ సమస్యలను తక్షణమే పరిష్కరించేలా చర్యలకు శ్రీకారం చుట్టింది. పంచాయతీల్లోని మల్టీపర్పస్ వర్కర్లలో ఆయా అంశాలపై అవగాహన ఉన్న వారిని మంచి నీటి సహాయ కులుగా ఎంపిక చేసింది. వారికి హైదరాబాద్‌లోని ఎంసీహెచ్ఆర్‌డీ కేంద్రంలో మాస్టర్‌ట్రైనర్ల ద్వారా ప్రత్యేక శిక్షణ అందిస్తోంది. ఈ ప్రక్రియ ఈ నెలాఖరు వరకు పూర్తి కానుండగా వచ్చే నెల నుంచివారి సేవలు అందుబాటులోకి రానున్నాయి.

ఇదీ పరిస్థితి ..

జిల్లాలో 473 గ్రామ పంచాయతీలుండగా 1509 మంది మల్టీపర్పస్ వర్కర్లు పనిచేస్తున్నారు. వీరంతా గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణతో పాటు నీటి సరఫరా సేవలు అందిస్తున్నారు. అయితే నీటిసరఫరాలో తలెత్తే సమస్యలను పరిష్కరించే నైపుణ్యం లేకపోవడంతో సమస్య వచ్చినప్పుడల్లా గ్రామాల్లో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. తరచూ మెకానిక్‌లను పిలిపించడం ఆర్థిక భారంగా మారుతోంది. చిన్నపాటి సమస్యకు సైతం రోజుల తరబడి నీటి సరఫరా నిలిచిపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు వీలుగా ప్రభుత్వం మల్టీపర్పస్ వర్కర్ల సేవలను వినియోగించుకోవాలని నిర్ణయించింది. అర్హులైన, ఆసక్తిగల వారిని పంచాయతీకి ఒకరు చొప్పున, మేజర్ గ్రామ పంచాయతీల్లో ఇద్దరిని ఎంపిక చేసింది. మాస్టర్ ట్రైనర్ల ద్వారా ఆయా అంశాలపై ప్రత్యేక శిక్షణనిస్తోంది.

ప్రత్యేక శిక్షణ

జిల్లాలోని 480 మంది మల్టీపర్పస్ వర్కర్లను మంచినీటి సహాయకులుగా ఎంపిక చేశారు. ఇప్పటివరకు 13మండలాల్లోని 359జీపీల సహాయకులకు శిక్షణ అందించారు. బేల, తాంసి, బోథ్, భీంపూర్ మండల్లాలోని వారికి శిక్షణ అందించాల్సి ఉంది. ఈ నెల 19లోపు ఈ ప్రక్రియ పూర్తి చేసేలా అధికారులు కార్యాచరణ సిద్ధం చేశారు. ముఖ్యంగా గ్రామాల్లో నిరుపయోగంగా ఉన్న చేతి పంపులు గుర్తించడం, వాటిని బాగు చేసి ఉపయోగంలోకి తీసుకురావడంతో పాటు విడి భాగాలపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తున్నారు. బోరు మోటార్ల పనితీరుపై అవగాహన, స్టార్టర్ల ఫీజుపోతే మరమ్మతు చేయడంపై వివరిస్తున్నారు. లీకేజీ పైపులను తొలగించడం, కొత్తవి ఏర్పాటు చేయడం, పగిలిన పైపులను అతికించడం వంటి అంశాలపై శిక్షణ ఇస్తున్నారు. అయితే ప్రాథమిక పరిజ్ఞానం కలిగిన వారిని మాత్రమే ఎంపిక చేసి కేవలం రెండు, మూడు రోజుల శిక్షణలో వీరు పూర్తిస్థాయి మెకానిక్‌ల తరహా సేవలు ఎలా అందిస్తారనేది ప్రశ్నార్థకంగా మారింది. పైగా వీరికి ఎలాంటి టూల్ కిట్స్ అందించడం లేదు.

మండలం	ఎంపికైన సహాయకులు
ఆదిలాబాద్‌రూరల్	34
బేల	37
బజార్‌హత్నూర్	31
భీంపూర్	26
బోథ్	36
గాదిగూడ	25
గుడిహత్నూర్	27
ఇచ్చోడ	32
ఇంద్రవెల్లి	29
జైనథ్	42
మావల	03
నార్నూర్	23
ఉట్నూర్	37
తలమడుగు	32
తాంసి	15
సిరికొండ	19
నేరడిగొండ	32

నీటి సరఫరాకు ఇబ్బందుల్లేకుండా..

గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడకుండా ఉండాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం పంచాయతీకి ఒకరు చొప్పున గ్రామ మంచినీటి సహాయకుడిని ఎంపిక చేసింది. పైపులైన్ల లీకేజీలను నియంత్రించడం, విద్యుత్ మోటార్లు బాగు చేయడం, చేతిపంపులను రిపేర్లు చేయడం, విద్యుత్ సర్వీస్ లైన్లను సరిచేయడం వంటి అంశాలపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. మరో నాలుగు మండలాల్లో సహాయకులకు శిక్షణ ఇవ్వాల్సి ఉంది. శిక్షణ పూర్తయిన వెంటనే గ్రామాల్లో సేవలందిస్తారు.

– చంద్రమోహన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ









రూ.10.. పరేషాన్..!

- మార్కెట్లో తగ్గిన కరెన్సీ నోట్ల చెలామణి
- ఇబ్బందుల్లో వ్యాపారులు, ప్రజలు



రూ.10 నోటు

నెన్నెల: మార్కెట్లో రూ.10 నోటు కనిపించడం గగనంగా మారింది. దీంతో అటు వ్యాపారులు.. ఇటు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. సాధారణ కొనుగోళ్లకు 1, 2, 5, 10 రూపాయల నాణేలు గతంలో చాలా చెలామణిలో ఉండేవి. ధరల పెరుగుదల కారణంగా 1, 2, 5 రూపాయల నాణేలు ఉన్నా 5, 10 రూపాయల నాణేల వినియోగం పెరిగింది. ప్రస్తుతం ఆయా నాణేలతోపాటు రూ.10 నోట్ల చెలామణి కూడా భారీగా తగ్గింది. వ్యాపారులు ఏదైనా వస్తువు విలువ చెప్పేటప్పుడు రూ.5కు రెండు, రూ.10కి మూడు అని చెబుతున్నారు. దీంతో కిరాణ, ఫ్యాన్సీ, కూరగాయలు, బస్సు, ఆటో చార్జీల్లో రూ.10 కరెన్సీనోటుకు ప్రాధాన్యం పెరిగింది. ప్రస్తుతం రూ.10 నోటు మార్కెట్‌లో అందుబాటులో లేక వ్యాపారులు ఇక్కట్లకు గురవుతున్నారు.

ఆన్‌లైన్ చెల్లింపులు

కరోనా తర్వాత డిజిటల్ చెల్లింపులు పెరిగాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహిస్తున్నాయి. దీంతో అన్ని వర్గాల ప్రజలు ఆన్‌లైన్ చెల్లింపులకు అలవాటుపడ్డారు. ఏ దుకాణానికి వెళ్లినా, ఏ వస్తువు కొనుగోలు చేయాలన్నా డిజిటల్ చెల్లింపులు అనే పరిస్థితి నెలకొంది. వీధి వ్యాపారులు, చిన్న దుకాణాల్లో, చిన్నపాటి చెల్లింపులకు ఫోన్‌పే, గూగుల్‌పే వంటివి ప్రత్యేకంగా వ్యాలెట్ రూపంలో సులభతర చెల్లింపులకు అనుమతిస్తున్నారు. దీంతో రూ.5, రూ.10 లావాదేవీలకు కూడా వినియోగదారులు నోట్లు ఇవ్వడంలేదు. క్రమంగా రూ.10 నోటు బదలాయింపు జరగకపోవడం వల్ల వ్యాపారులు, వినియోగదారుల వద్ద అందుబాటులో లేకుండా పోయింది. మార్కెట్‌లో ప్రస్తుతం చిరిగిన రూ.10 నోట్లు దర్శనమిస్తుండడం గమనార్హం.

ఎక్కడ ఆగిందో..?

రూ.10 నోటు మార్కెట్‌లో చెలామణి తగ్గడంలో అసలు సమస్య ఎక్కడ ఉత్పన్నమైందో అర్థం కాని పరిస్థితి ఏర్పడింది. వ్యాపారులు సైతం ఈ పరిస్థితిపై ఓ అంచనాకు రాలేకపోతున్నారు. వినియోగదారులు చిరు వ్యాపారుల వద్ద వస్తువులు కొనుగోలు చేసినప్పుడు రూ.100నోటు ఇస్తే వ్యాపారులు తిరిగి ఇవ్వాల్సిన చిల్లరకు నానా అవస్థలు పడుతున్నారు. గతంలో రూ.1, రూ.2 చెల్లింపులకు బదులుగా చాక్లెట్లు, బిస్కెట్లు వంటివి ఇచ్చేవారు. కానీ రూ.10లకు ఏమి ఇవ్వాలని వ్యాపారులు ఆలోచనలో పడ్డారు. ఇస్తే వినియోగదారుడు ఎలా స్పందిస్తారనే ఆందోళన వారిలో నెలకొంది. భారీ మొత్తాల చెల్లింపుల విషయంలో పరిస్థితి భిన్నంగా ఉంది. పెద్ద మొత్తంలో లావాదేవీలకు డిజిటల్ చెల్లింపులు జరిగితే వినియోగదారులు, వ్యాపారులు పన్నుల పరిధిలోకి వస్తామని ఆందోళన చెందుతుండడమే ఈ పరిస్థితికి కారణం. చిన్న మొత్తాల చెల్లింపుల కారణంగా కొన్నిసార్లు యూపీఐ సర్వర్‌లపై భారం పడి పని చేయని పరిస్థితి నెలకొంటోందని వ్యాపారులు చెబుతున్నారు.

నోట్ల కొరత వాస్తవమే

రూ.10 నోట్ల కొరత ఉన్న మాట వాస్తవమే. రిజర్వు బ్యాంకు నుంచి రావడం లేదు. రూ.20, రూ.50, రూ.100 నోట్లు మాత్రమే వస్తున్నాయి. రూ.10 నోట్లు రావడం లేదు. నాణేలు మాత్రం అందుబాటులో ఉన్నాయి. అవి చెల్లుబాటులో ఉన్నాయని ప్రజలు గమనించాలి. – గోపికృష్ణ, తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్, ఆవుడం

CHANGE OF NAME


I, JOSLINE JYOTHIRMAYI W/o. BOMIDI CHANDRA SEKHAR RAO, R/o. H.No. 10-184/1, Aadarshnagar, Dasnapur, Adilabad, State of T.G., India. Change my Name as **BOMIDI JYOTHIRMAYI** W/o. **BOMIDI CHANDRA SEKHAR RAO** R/o. H.No. 10-184/1, Aadarshnagar, Dasnapur, Adilabad, State of T.G., India. By the Virture of Passport, vide affidavit Date: 11.10.2024, under the oath taken by Notary P Dayakar

కొత్త పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి

జైపూర్: సింగరేణి అధికారులు, ఉద్యోగులు కొత్త పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ సంస్థకు మరింత లాభాలు వచ్చే విధంగా కృషి చేయాలని చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి అన్నారు. శుక్రవారం జైపూర్‌లోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్, ఇందారం, ఓసీపీ అధికారులతో కలిసి సందర్శించారు. 'ఉజ్వల సింగరేణి–ఉద్యోగుల పాత్ర' కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఐకే–1ఏ గనిపై నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీ వంశీకృష్ణ, ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి పాల్గొన్నారు. ఇందులో డీ.రాజశేఖర్ రావు, ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, జీఎంలు శ్రీనివాసులు, సంజీవరెడ్డి, ఓఅండ్ఎం జైన్‌సింగ్ పాల్గొన్నారు.

కొండచిలువ హతం

కుంటాల:మండలంలోని ఓలా శివారులో వ్యవసాయ పనులు చేస్తుండగా కనిపించిన కొండ చిలువను రైతులుశుక్రవారం హతమార్చారు. కుంటాలకు చెందిన గొల్ల నవీన్, ఒడ్నం రమేశ్ సోయా పంట నూర్పిడి చేసే క్రమంలో పిచ్చిమొక్కలు తొలగిస్తున్నారు. ఈ క్రమంలో వారికి కొండ చిలువ కనిపించింది. వెంటనే దాన్ని హతమార్చారు. సుమారు 7 ఫీట్ల ఎత్తు, 15కిలోల బరువు ఉందని రైతులు తెలిపారు.



'ప్రేరణ'కు ఇద్దరు విద్యార్థులు

- జాతీయ సదస్సుకు జిల్లా నుంచి ఎంపిక..
- గుజరాత్‌లో 13 నుంచి 19 వరకు శిక్షణ


తల్లితో విద్యార్థి సట్లవార్ హరీశ్

ఆదిలాబాద్‌టౌన్: కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ప్రేరణ కార్యక్రమానికి జిల్లా నుంచి ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. దేశ చరిత్ర, సంస్కృతిక సాంప్రదాయాలు, వారసత్వం, దేశం కోసం ఏం చేయాలనే లక్ష్యాలను నిర్దేశించేందుకు కేంద్ర ప్రభుత్వం వికసిత్ భారత్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. విద్యార్థుల్లో చిన్నతనం నుంచే జాతీయ భావాలను పెంపొందించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. గుజరాత్ రాష్ట్రంలోని వద్రాఘర్ పాఠశాలలో ఈనెల 13 నుంచి 19 వరకు వారం పాటు శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు జిల్లా కేంద్రం నుంచి ఇద్దరు విద్యార్థులతో పాటు గైడ్ టీచర్ శనివారం వెళ్లనున్నారు.

ప్రతిభ కనబర్చి..

జిల్లాలోని ఆయా పాఠశాలల విద్యార్థులకు ఆదిలాబాద్‌లోని కేంద్రీయ విద్యాలయంలో ఏప్రిల్‌లో ప్రతిభాపాటవ పోటీలు నిర్వహించారు. చిత్రలేఖనం, వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించి ప్రతిభ కనబర్చిన ఇద్దరిని ఎంపిక చేశారు. ఇందులో పట్టణంలోని బంగారుగూడ మోడల్ స్కూల్‌కు చెందిన సట్లవార్ హరీష్, జిల్లా కేంద్రంలోని లిటిల్‌ఫ్లవర్ పాఠశాల విద్యార్థి గుండావార్ అక్ష ఉన్నారు. వీరి ఎంపిక కావడంపై డీఈవో ప్రణీత హర్షం వ్యక్తం చేశారు.

పేకాట స్థావరంపై దాడి

మందమర్రిరూరల్: మందమర్రి పోలీస్‌స్టేషన్ పరిధిలోని చెత్లాపూర్ సమీపంలో పేకాట స్థావరంపై ఎస్సై రాజశేఖర్ శుక్రవారం తన సిబ్బందితో దాడి చేశారు. నీరటి శ్రీశైలం, పులి బానయ్య, కప్ప నర్సయ్య, బబ్బెర విజయ్, రత్నం వెంకటస్వామిలను అరెస్టు చేశారు. రూ.15,720 నగదు, ఐదుసెల్‌ఫోన్లు, ఐదు మోటార్ సైకిళ్లు స్వాధీనం చేసుకున్నారు.

దొంగతనం కేసులో ఒకరి రిమాండ్

- రూ. 3.05 లక్షలు స్వాధీనం


మాట్లాడుతున్న డీఎస్పీ జీవన్ రెడ్డి

ఆదిలాబాద్‌రూరల్: సూపర్‌మార్కెట్‌లో చోరీకి పాల్పడ్డ నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ జీవన్‌రెడ్డి తెలిపారు. మావల పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఇచ్చోడ మండలం సుంకిడి గ్రామానికి చెందిన చౌహన్ సుప్రభాత్ ఆదిలాబాద్ పట్టణంలోని అటెండర్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. దస్నాపూర్ కాలనీలోగల సాగర్ సూపర్ మార్కెట్‌లో ఐదేళ్లుగా గోడౌన్ ఇన్‌చార్జిగా పనిచేస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా అతడు షాపులో దొంగతనం చేయాలని భావించాడు. ఇందులో భాగంగా ఈ నెల 5న నల్లటి ముసుగు కొనుగోలు చేశాడు. 6వ తేదీన దానిని షాపులోని మెట్ల కింద భద్రపరచి అక్కడే దాగి ఉన్నాడు. యాజమాని దుకాణం మూసి వెళ్లిన తర్వాత అర్ధరాత్రి షాపులోని కౌంటర్లలో ఉన్న రూ.3.05 లక్షలు తీసుకున్నాడు. లిఫ్ట్‌ద్వారా స్లాబ్‌పైకి వెళ్లి పైపు సాయంతో కిందికి దిగి వెళ్లిపోయాడు. 7న ఉదయం యజమాని తాళం తీసి పరిశీలించగా నగదు కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నిందితుడు అప్పు చెల్లించేందుకు వెళ్తున్న క్రమంలో అనుమానం వచ్చి విచారించగా దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నాడు. అతడి వద్ద నుంచి నగదు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ పేర్కొన్నారు. దొంగను పట్టుకున్న రూరల్ సీఐ ఫణిందర్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, మావల ఎస్సై విష్ణువర్ధన్‌తో పాటు సీసీఎస్ పోలీసులను ఎస్పీ గౌస్ ఆలం అభినందించినట్లు ఆయన తెలిపారు.

దాడి కేసుల్లో ఎనిమిది మంది అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ బన్సీలాల్

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని హమాలీవాడ, సప్తగిరి కాలనీ, అశోక్‌రోడ్‌లో దాడులకు దిగిన ఎనిమిది మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పట్టణ సీఐ బన్సీలాల్ తెలిపారు. శుక్రవారం రాత్రి స్థానిక పోలీసుస్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. చర్చి సమీపంలో మహిళలు బతుకమ్మ ఆడుతుండగా శ్రావణ్, వంశీలపై మద్యం మత్తులో శరత్, సురేష్, అనిరుధ్, అఖిల్ మరికొందరు దాడి చేశారని తెలిపారు. సప్తగిరి కాలనీలో ప్రేమ వ్యవహారానికి సంబంధించి తోట తిరుపతిపై అగ్గు మారుతితోపాటు మరి కొందరు దాడి చేశారని పేర్కొన్నారు. అశోక్‌రోడ్‌లో అప్పు వ్యవహారానికి సంబంధించి కోపం పెంచుకుని సోహెల్‌పై రాజు, శ్రావణ్, చిలుక సాయి మరికొందరు మద్యం మత్తులో దాడిచేసి అతడి కారు అద్దం ధ్వంసం చేశారనితెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు శరత్, సురేష్, అనిరుధ్, అఖిల్, మారుతి, రాజు, శ్రావణ్, సాయిలను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. పండుగ పూట మద్యంమత్తులో, పాత కక్షలు దృష్టిలో ఉంచుకుని దాడులకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు. సమవేశంలో ఎస్సైలు సనత్ రెడ్డి, సురేశ్ పాల్గొన్నారు.



























హైదరాబాద్ చాదర్‌ఘాట్‌లోని విక్టరీ ప్లే గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన 65 అడుగుల దుర్గా మాత విగ్రహం



సిద్ధిధాత్రి రూపంలో బాసర జ్ఞాన సరస్వతి



సిద్ధిధాత్రిదేవిగా అలంపూర్ జోగులాంబ



మహిషాసురమర్దినిగా వరంగల్ భద్రకాళి

స్కిల్స్ యూనివర్సిటీలో నాలుగు కొత్త కోర్సులు

- దసరా నుంచి దరఖాస్తుల స్వీకరణ
- తుది గడువు అక్టోబర్ 29
- నవంబర్ 4 నుంచి తరగతులు

సాక్షి, హైదరాబాద్: యువతలో నైపుణ్యం పెంచడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం స్థాపించిన యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ తొలి విడతలో నాలుగు కోర్సులను దసరా నుంచి ప్రారంభిస్తోంది. నైపుణ్య శిక్షణ కోసం యూనివర్సిటీ 'స్కూల్ ఆఫ్ లాజిస్టిక్స్', 'స్కూల్ ఆఫ్ ఈ కామర్స్', 'స్కూల్ ఆఫ్ హెల్త్‌కేర్' పేరిట ఇప్పటికే మూడు స్కూళ్లను ప్రారంభించింది. స్కూల్ ఆఫ్ లాజిస్టిక్స్, ఈ కామర్స్‌లో 'వేర్ హౌజ్ ఎగ్జిక్యూటివ్', 'కీ కన్‌సైన్మెంట్ ఎగ్జిక్యూటివ్' కోర్సులను ఆఫర్ చేస్తున్నాయి. స్కూల్ ఆఫ్ హెల్త్‌కేర్ ద్వారా 'నర్సింగ్ ఎక్సలెన్స్', 'ఫార్మా అసోసియేట్ ప్రోగ్రామ్' కోర్సుల్లో నైపుణ్య శిక్షణ ఇస్తారు. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ వెబ్‌సైట్ ద్వారా ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈ కోర్సులకు దరఖాస్తు చేసుకోవాలని యూనివర్సిటీ ఒక ప్రకటనలో కోరింది. దరఖాస్తు చేసుకునేందుకు అక్టోబర్ 29 చివరి తేదీ కాగా, నవంబర్ 4వ తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయి. తరగతులను తాత్కాలికంగా ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఇస్కి), నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (నాక్) ఆవరణలో నిర్వహిస్తారు. యువతకు ఉపాధి కల్పన లక్ష్యంగా వివిధ రంగాల్లో నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో ఇటీవల యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేయడం తెలిసిందే.

బీఆర్‌ఎస్‌లో ఎమ్మెల్సీ సందడి

పట్టభద్రుల కోటా టికెట్ కోసం ఇప్పటి నుంచే ఆశావహుల ప్రయత్నాలు

- అధినేత కేసీఆర్ దృష్టిలో పడేలా సభ్యత్వ నమోదు పేరిట హడావుడి
- ముందస్తుగా ప్రచారం పేరిట ఫ్లెక్సీల ఏర్పాటు
- ఉపాధ్యాయ కోటా స్థానాల ఎన్నికలకు దూరంగా బీఆర్‌ఎస్?

సాక్షి, హైదరాబాద్: శాసనమండలిలో ఉపాధ్యాయ కోటాలో ఇద్దరు ఎమ్మెల్సీలు, పట్టభద్రుల కోటాలో ఒక ఎమ్మెల్సీ ఆరేళ్ల పదవీకాలం వచ్చే ఏడాది మార్చిలో ముగియనుంది. ఖాళీ అయ్యే స్థానాల్లో ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల సంఘం సన్నాహాలు చేస్తోంది. ఈ నేపథ్యంలో బరిలో నిలించేందుకు బీఆర్‌ఎస్ నుంచి ఔత్సాహికులు ఇప్పటి నుంచే సందడి చేస్తున్నారు. ఎన్నికలు జరిగే స్థానాల్లో ఓటరు నమోదు కార్యక్రమం ప్రారంభమైన నేపథ్యంలో.. ఆశావహులు సోషల్ మీడియా, ఇతర మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం చేస్తున్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కుల సంఘాల పేరిట జరుగుతున్న సమావేశాల్లో పాల్గొంటూ తమకు మద్దతు ఇవ్వాల్సిందిగా కోరుతున్నారు. పట్టణాలు, మండల కేంద్రాలు, ప్రధాన రహదారుల వెంట ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి సభ్యత్వ నమోదు పేరిట ప్రచారం చేసుకుంటున్నారు. తద్వారా తాము పార్టీ అభ్యర్థిత్వాన్ని ఆశిస్తున్నట్లు బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌కు సంకేతాలు పంపుతున్నారు.

ఉపాధ్యాయ కోటాపై అనాసక్తి

వచ్చే ఏడాది మార్చిలో 'మెదక్‌–కరీంనగర్‌–ఆదిలాబాద్‌–నిజామాబాద్' ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తమరెడ్డి(పీఆర్‌టీయూ)తోపాటు 'వరంగల్‌–ఖమ్మం–నల్లగొండ' ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి(యూటీఎఫ్) పదవీకాలం ముగుస్తుంది. 2019లో జరిగిన ఎన్నికల్లో ఈ రెండు నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్ అధికారికంగా అభ్యర్థులను బరిలోకి దించలేదు. పీఆర్‌టీయూకు పరోక్షంగా



పట్టభద్రుల ఎన్నికల నేపథ్యంలో న్యాయవాదులతో సమావేశమైన సర్దార్ రవీందర్‌సింగ్

మద్దతు ప్రకటించింది. ప్రస్తుతం బీఆర్‌ఎస్‌తో పీఆర్‌టీయూ అంటీముట్టనట్టు వ్యవహరిస్తున్న నేపథ్యంలో ఉపాధ్యాయ కోటా ఎమ్మెల్సీ ఎన్నికలకు బీఆర్‌ఎస్ ప్రత్యక్షంగా, పరోక్షంగా దూరంగా ఉండే సూచనలు కనిపిస్తున్నాయి.

అందరి దృష్టి పట్టభద్రుల స్థానంపైనే

'మెదక్‌–కరీంనగర్‌–ఆదిలాబాద్‌–నిజామాబాద్' పట్టభద్రుల నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు పలువురు బీఆర్‌ఎస్ నేతలు ఆసక్తి చూపుతున్నారు. 13 జిల్లాల్లోని 42 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఈ పట్టభద్రుల నియోజకవర్గం విస్తరించి ఉంది. ఓటర్లను చేరుకునేందుకు ఇప్పటి నుంచే ఆశావహులు తమ వంతు ప్రయత్నాలు ప్రారంభించారు. కరీంనగర్ నుంచి మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్, మెదక్ నుంచి మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్‌రెడ్డి, నిజామాబాద్ నుంచి రాజారాంయాదవ్ బీఆర్‌ఎస్ నుంచి పోటీ చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. తమ మద్దతుదారులను రంగంలోకి దించి ఓటరు నమోదు కార్యక్రమంలో చురుగ్గా పాల్గొంటున్నారు. పార్టీ అధినేత కేసీఆర్ గతంలోనే తనకు హామీ ఇచ్చినట్లు రవీందర్ సింగ్ చెబుతున్నారు.

గతంలో.. బలమున్నా బరికి దూరం

మండలి పట్టభద్రుల కోటా 2019 ఎన్నికల సందర్భంలో 'మెదక్‌–కరీంనగర్‌–ఆదిలాబాద్‌–నిజామాబాద్' నియోజకవర్గ పరిధిలో కాంగ్రెస్‌కు కేవలం ఇద్దరు ఎమ్మెల్యేలు శ్రీధర్‌బాబు (మంథని), జగ్గారెడ్డి (సంగారెడ్డి) మాత్రమే ఉన్నారు. నాలుగు జిల్లాల పరిధిలో కాంగ్రెస్ నుంచి చేరిన ఎమ్మెల్యేల సంఖ్యను కలుపుకొని 40 మంది ఎమ్మెల్యేలున్న బీఆర్‌ఎస్ పోటీకి దూరంగా ఉంది. స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన చంద్రశేఖర్‌గౌడ్‌కు మద్దతు ప్రకటించగా, కాంగ్రెస్ తరపున పోటీ చేసిన టి.జీవన్‌రెడ్డి పట్టభద్రుల కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు.

ఇప్పుడు.. కీలక నేతలందరూ ఇక్కడే

ప్రస్తుతం 'మెదక్‌–కరీంనగర్‌–ఆదిలాబాద్‌–నిజామాబాద్' పట్టభద్రుల నియోజకవర్గ పరిధిలో 42 మంది ఎమ్మెల్యేలకుగాను కాంగ్రెస్‌కు 19, బీఆర్‌ఎస్‌కు 16, బీజేపీకి ఏడుగురు ఎమ్మెల్యేలు ఉన్నారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు జి.మహిపాల్‌రెడ్డి (పటాన్‌చెరు), సంజయ్ (జగిత్యాల), పోచారం శ్రీనివాసరెడ్డి (బాన్సువాడ) కాంగ్రెస్ గూటికి చేరారు. అయితే బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సహా కీలక నేతలు హరీశ్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డి, గంగుల కమలాకర్ తదితరులు సిట్టింగ్ ఎమ్మెల్యేలుగా ఉన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో బీఆర్‌ఎస్‌కు క్షేత్రస్థాయిలో సానుకూల వాతావరణం ఉందని, పార్టీ అవకాశమిస్తే గెలుపు సాధిస్తామనే ధీమా ఆశావహుల్లో కనిపిస్తోంది.

▼ నగరోత్సవంలో ఉత్సవమూర్తులు





శ్రీ మహిషాసురమర్దినిగా దుర్గమ్మ

మహిషాసురమర్దినిగా అనుగ్రహించిన దుర్గమ్మ

నేటి రాజరాజేశ్వరి అలంకారంతో ముగియనున్న దసరా ఉత్సవాలు.. పెరుగుతున్న భవానీ భక్తులు

సాక్షి ప్రతినిధి, విజయవాడ/వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాలు చివరి దశకు చేరాయి. తొమ్మిదోరోజు శుక్రవారం మహిషాసురమర్దిని రూపంలో అమ్మవారు దర్శనమిచ్చారు. ఇక ఈ ఉత్సవాలు శనివారం పూర్ణాహుతితో ముగియనున్నాయి. ఈ ఏడాది ఉత్సవాల్లో మూలానక్షత్రం నుంచి భక్తుల రద్దీ కొనసాగుతూనే ఉంది. ఉత్తరాంధ్ర నుంచి వచ్చే భక్తుల సంఖ్య బాగా పెరిగింది. ముందస్తు అంచనాలకు అనుగుణంగా ఈ ఏడాది పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుంటారని అంచనా వేసినప్పటికీ గత ఏడాదితో పోల్చుకుంటే భక్తుల సంఖ్య తగ్గింది. ఇప్పటికి దాదాపు 7 లక్షల నుంచి 7.5 లక్షల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్లు ఆలయ వర్గాలు తెలిపాయి. మహర్నవమి సందర్భంగా తరలి వచ్చిన భక్తులు నగరోత్సవంలో అమ్మవారిని దర్శించుకుని తరించారు.

కనుల పండువగా తెప్పోత్సవం

దసరా ఉత్సవాల ముగింపు సందర్భంగా విజయదశమి రోజు కనకదుర్గాదేవికి కృష్ణానదిలోని దుర్గాఘాట్‌లో సాయంత్రం 5 గంటలకు శ్రీగంగా, దుర్గ అమ్మవార్ల సమేత మల్లేశ్వరస్వామి తెప్పోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ కమనీయ దృశ్యాలను భక్తులు వీక్షించేందుకు వీలుగా ప్రత్యేకంగా గుర్తించిన పది ప్రాంతాల్లో ఎల్ఈడీలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. చివరిరోజు అమ్మవారిని దర్శించుకొనేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉంది.



అమెరికాలో బతుకమ్మ సంబరాలు

రాయికల్ (జగిత్యాల): అమెరికాలోని విస్కాన్సిన్ స్టేట్ సన్‌ప్రేరీ సిటీలో శుక్రవారం బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. వివిధ రకాల పూలతో బతుకమ్మను పేర్చి గౌరీదేవిని ప్రతిష్ఠించిన అనంతరం ఆడిపాడుతూ ఉత్సాహంగా గడిపారు. అనంతరం వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. జగిత్యాల జిల్లా కేంద్రానికి చెందిన సింధు, ప్రవాస తెలంగాణ మహిళలు ఉష, రమ్య, కవిత, ప్రత్యూష, లక్ష్మి, సుస్మిత, లావణ్య, తేజ, దీపిక, హారిక, స్వప్న, శాంతి, శ్వేత, ఆకృతి పాల్గొన్నారు.

28 ఏళ్లకు ఇల్లు చేరిన వలసజీవి

- బహ్రెయిన్ జైల్ నుంచి గోపాల్‌రావుపల్లెకు
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చొరవ

సిరిసిల్ల: బతుకుదెరువు కోసం ఉన్న ఊరిని.. కట్టుకున్న భార్యను, కన్నపిల్లలను విడిచి పొట్ట చేతపట్టుకుని ఎడారి దేశానికి వెళ్లిన 34 ఏళ్ల యువకుడు.. ఏకంగా 28 ఏళ్లకు అంటే 62 ఏళ్ల వయసులో ఇల్లు చేరాడు. రాజన్నసిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం చీర్లవంచకు చెందిన మానువాడ నర్సయ్య (62) అనే వృద్ధుడు బహ్రెయిన్ జైలులో బందీగా ఉండి.. ఇటీవల అత్తగారి ఊరైన గోపాల్‌రావుపల్లెకు చేరాడు.

బతుకుదెరువు కోసం వెళ్లి

దళితుడైన మానువాడ నర్సయ్య(34) చీర్లవంచలో భూమి లేక.. ఉపాధి లేక కుటుంబ పోషణకు 1996 సెప్టెంబరు 23న బహ్రెయిన్ దేశానికి వెళ్లాడు. బహ్రెయిన్‌లోని ది అరబ్ ఇంజినీరింగ్ అండ్ కాంట్రాక్టింగ్ కంపెనీలో మూడేళ్ల పాటు తాపీమేస్త్రీగా పనిచేశాడు. 1999 ఆగస్టులో వర్క్‌పర్మిట్ ముగిసింది. నర్సయ్యకు హైదరాబాద్ పాస్‌పోర్ట్ కార్యాలయం 1989 సెప్టెంబర్ 22న పాస్‌పోర్ట్ జారీచేశారు. బహ్రెయిన్‌లోని ఇండియన్ ఎంబసీ అధికారులు 2001 నవంబర్ 18న పాస్‌పోర్ట్‌ను రెన్యూవల్ చేశారు. దాని గడువు కూడా ముగిసిపోవడంతో ఏడాది కిందట బహ్రెయిన్ పోలీసులు నర్సయ్యను పట్టుకుని వీసా లేదని, పాస్‌పోర్టు లేదని జైలులో వేశారు. ఏడాదిగా బహ్రెయిన్



బతుకుదెరువు బాటలో బంధీ

నర్సయ్యపై 'సాక్షి'లో వచ్చిన కథనం

జైలులో బంధీగా ఉన్నారు. నర్సయ్య దీనగాథపై 'సాక్షి' కథనాలు ప్రచురించింది.

నర్సయ్య విడుదల కోసం లేఖలు

బహ్రెయిన్ జైలులో బంధీగా ఉన్న నర్సయ్య విడుదల కోసం సిరిసిల్ల ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారక రామారావు విదేశాంగ మంత్రి జైశంకర్‌కు లేఖ రాశారు. తన నియోజకర్గానికి చెందిన నర్సయ్యను స్వదేశానికి రప్పించాలని కోరారు. వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ బహ్రెయిన్‌లోని ఎంబసీ అధికారులకు లేఖ రాశారు. ఆది శ్రీనివాస్ చొరవతో బహ్రెయిన్ అధికారులు నర్సయ్యకు పాస్‌పోర్టు జారీచేసి విమాన టిక్కెట్‌ను సమకూర్చి ఇంటికి పంపించారు.



భార్య లక్ష్మితో మానువాడ నర్సయ్య

ఊరు మునిగింది.. కుటుంబం చెదిరింది

నర్సయ్య సొంతూరు చీర్లవంచ. ఆ ఊరు ఆరేళ్ల కిందట మధ్యమానేరు జలాశయంలో పూర్తిగా మునిగిపోయింది. నర్సయ్య గల్ఫ్‌లో ఉండగానే ఊరు ముంపునకు గురైంది. దీంతో నర్సయ్య భార్య లక్ష్మి, కూతుళ్లు సోన, అపర్ణ, కొడుకు బాబుతో గోపాల్‌రావుపల్లెకు చేరింది. కూతుళ్లు సోన, అపర్ణలకు లక్ష్మి పెళ్లిళ్లు చేసింది. కొడుకు బాబు గోపాల్‌రావుపల్లెలో కూలి పనిచేస్తున్నాడు. చీర్లవంచ మునిగిపోవడంతో గూడు చెదిరిన పక్షుల్లా నర్సయ్య కుటుంబం చెదిరింది. 28 ఏళ్లుగా గల్ఫ్‌లో ఉన్న నర్సయ్య ఎట్టకేలకు మాతృభూమికి చేరారు. భార్య లక్ష్మి అనారోగ్యంతో ఉండగా.. నర్సయ్యకు గోపాల్‌రావుపల్లెలో భూమి లేదు.. ఉపాధి లేదు.. ఏం చేయాలో తెలియని స్థితిలో దిక్కులు చూస్తున్నాడు. 28 ఏళ్ల గల్ఫ్ యానం అతనికి వృద్ధాప్యాన్ని ఇచ్చింది. చీర్లవంచ ఊరు మధ్యమానేరులో మునిగిపోవడంతో నర్సయ్యకు మానవత్వంతో ప్రభుత్వం నుంచి రావాల్సిన కుటుంబ పునరావాస ప్యాకేజీ అందించాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

నేత్రపర్వం శ్రీనివాస కల్యాణం

సిరిసిల్లటౌన్: శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం శుక్రవారం నేత్రపర్వంగా సాగింది. సిరిసిల్ల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం కల్యాణోత్సవం జరిగింది. ఆదిదేవుని వివాహ వేడుకకు అత్యధిక సంఖ్యలో భక్తులు హాజరై, మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి హంస వాహనంపై శ్రీదేవి, భూదేవి సహిత శ్రీనివాసుడుని తిరువీధుల్లో ఊరేగించారు. ఆలయ ఈవో మారుతీరావు, ఏఈవో పీసరి రవీందర్, అర్చకస్వాములు రామాచారి, కృష్ణమాచారి, మాజీ చైర్మన్లు ఉప్పుల విఠల్‌రెడ్డి, మాజీచైర్మన్లు తీగల శేఖర్‌గౌడ్, చేపూరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.





కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



మనసు నిండా.. ఆకాశవాణి

- స్థానిక యాసకు పెద్దపీట
- వినూత్న కార్యక్రమాలతో రేడియో ప్రసారాలు
- నేడు 39వ వసంతంలోకి 'ఆదిలాబాద్ కేంద్రం'

ఆదిలాబాద్: నేటి సాంకేతిక యుగంలోనూ రేడియో తనదైన ఉనికిని చాటుకుంటుంది. ప్రారంభమైన తొలినాళ్లలో ఈ ప్రసారాలకు ఎంతో ప్రాధాన్యత ఉండేది. డిజిటల్ విప్లవంతో ఎలక్ట్రానిక్ పరికరాలు, కంప్యూటర్లు, స్మార్ట్‌ఫోన్లు వాటి స్థానాన్ని ఆక్రమించాయి. తదనుగుణంగా రేడియో సైతం ఎఫ్ఎం పేరుతో శ్రోతల చెవుల్లో మార్మోగుతోంది. ఆదిలాబాద్ ఆకాశవాణి కేంద్రం సైతం తనదైన ప్రత్యేకతను చాటుకుంటుంది. స్థానిక మాండలికానికి ప్రాధాన్యతనిస్తూ సంస్కృతి సౌరభాలను వెదజల్లుతూ, స్థానిక కళలు, కళాకారులను ప్రోత్సహిస్తూ ముందుకు సాగుతోంది. 1986 అక్టోబర్ 12న జిల్లా కేంద్రంగా ఈ ప్రసారాలు ప్రారంభమయ్యాయి. నేడు 39వ వసంతంలోకి అడుగు పెడుతున్న వేళ ప్రత్యేక కథనం.

తెలుగు రాష్ట్రాల్లోనే తొలి స్థానిక కేంద్రం...

ఈ కేంద్రానికి ఎంతో ప్రత్యేకత ఉంది. దేశవ్యాప్తంగా మూడోది కాగా.. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో తొలి స్థానిక కేంద్రంగా ఏర్పాటయింది. ప్రారంభంలో ఏఎం పద్ధతిలో కిలోవాట్ సామర్థ్యం ట్రాన్స్‌మీటర్‌తో ప్రసారాలు ప్రారంభించింది. అనంతరం మూడు కిలోవాట్ల ప్రసారశక్తిని అందుకుంది. 2017ఆగస్టు 15నుంచి ఎఫ్ఎం కేంద్రంగా నూతన సొబగులు అద్దుకుంది. ఆదిలాబాద్ ఆకాశవాణి కేంద్రం 100.2 ఎఫ్ఎం– మనసు నిండా పేరుతో ప్రస్తుతం కార్యక్రమాలు ప్రసారం అవుతున్నాయి. మొబైల్ యాప్ వేదిక ద్వారా ప్రపంచంలో ఎక్కడున్నా ఆకాశవాణి కేంద్ర ప్రసారాలు శ్రోతల చెవులకు చేరువవుతున్నాయి.

కళలకు ఆదరువుగా..

అంతేకాకుండా ఆకాశవాణిలో ఒగ్గు కథ, బుడగజంగం, బుర్రకథ, చిందు యక్షగానం, మందహెచ్చుల వంటి కథన ప్రక్రియలను శ్రోతలకు వినిపిస్తోంది. అలాగే జానపద ప్రాచీన గాథలు పాటలను వ్యాఖ్యాన సహితంగా ప్రసారం చేస్తూ వస్తుంది. గ్రామీణ ప్రాంతాల్లోని స్థానిక జానపద గేయాలు, గిరిజన సంస్కృతి సాంప్రదాయాలను ప్రతిబింబించే గీతాలను స్వయంగా గ్రామీణులు, గిరిజనులతో పాడిస్తూ వాటికి ప్రాచుర్యాన్ని కల్పిస్తోంది. పల్లె పదాలు, గిరి పదం, మన పురాణాలు, మావ శీర్షికలతో ఈ జానపద కథాగానాలను ప్రసారం చేస్తుంది. ఇలా కళాకారులను ప్రోత్సహిస్తూ కళలకు జీవం పోస్తోంది.

సాహిత్య సౌరభాలు...

సాహిత్య అభిమానుల కోసం పుస్తకంతో, నవలతో, కథనం, కైత, బాసరుచులు పేరిట ఉత్తమమైన తెలుగు సాహిత్య రచనల నుంచి కథ, నవల, కండికల సాహిత్యాన్ని ధారావాహికల రూపంలో వినిపిస్తోంది. చిన్నారుల కోసం సంబురం, కతిందాం శీర్షికల పేరిట కథలు, కదంబాలను ప్రసారం చేస్తూ వస్తోంది. ఈ విధంగా ఆదిలాబాద్ ఆకాశవాణి వినూత్నమైన కార్యక్రమాలతో ముందుకు సాగుతోంది.



ఆదిలాబాద్‌లోని ఆకాశవాణి కేంద్రం

అన్నదాతలకు బాసటగా...

వ్యవసాయ అభివృద్ధికి, అన్నదాతలకు సలహాలు సూచనలు ఇవ్వడానికి ప్రత్యేక కార్యక్రమాలను ఆకాశవాణి ప్రసారం చేస్తుంది. ముఖ్యంగా ఇల్లూ ఎవుసం, కిసాన్ వాణి వంటి కార్యక్రమాల ద్వారా రైతులకు వ్యవసాయ, శాస్త్రవేత్తలు, అధికారులు, నిపుణుల ద్వారా ఎన్నో విలువైన సలహాలు, సూచనలు అందజేస్తోంది. అలాగే సేంద్రియ సాగు, ప్రయోగాత్మక పద్ధతుల ద్వారా వ్యవసాయ రంగంలో విజయవంతమైన రైతుల స్ఫూర్తిదాయక గాథలను రైతు అంతరంగం శీర్షిక ప్రసారం చేస్తూ వారికి దిక్సూచిలా నిలుస్తోంది.

జీవితాలు ప్రతిబింబించేలా కార్యక్రమాలు

స్థానిక కళలు, సాంప్రదాయాలను ప్రపంచానికి పరిచయం చేసేలా ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్తున్నాం. ఆదిలాబాద్ ఆకాశవాణి కేంద్రం ద్వారా ఇక్కడి సాంస్కృతిక భాషా పరమైన వైవిధ్యాన్ని ఒడిసి పట్టుకొని ఇక్కడ జీవితాలు, అవసరాలు, ఆకాంక్షలను ప్రతిబింబించేలా కార్యక్రమాలను ప్రసారం చేస్తున్నాం. శ్రోతల మనసుకు నిండుగా దగ్గరవుతూ ప్రత్యేక కార్యక్రమాలతో ముందుకు సాగుతున్నాం. అచ్చమైన ఆదిలాబాద్, తెలంగాణ మాండలికంలో కలివిడిగా, కలుపుగోలుగా ప్రసారం చేస్తూ రాష్ట్రంలోనే ప్రత్యేకమైన కేంద్రంగా గుర్తింపు సొంతం చేసుకునే దిశగా అడుగులు వేస్తున్నాం. – కే.రామేశ్వర్, ఆకాశవాణి ముఖ్య కార్యక్రమాధికారి

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జట్టుకు కాంస్యం

ఆసిఫాబాద్‌అర్బన్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మహిళల హ్యాండ్‌బాల్ జట్టు సత్తా చాటింది. రంగారెడ్డి జిల్లాలోని తొర్రూర్‌లో మూడు రోజులుగా 53వ సీనియర్ పురుషులు, మహిళల రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ కొనసాగుతోంది. ఈ పోటీల్లో ఉమ్మడి జిల్లా మహిళల జట్టు మూడోస్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించిందని ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు గోనె శ్యామ్‌సుందర్‌రావు, ప్రధాన కార్యదర్శి కనపర్తి రమేశ్ తెలిపారు. కెప్టెన్ రమ్య, క్రీడాకారులు నిర్వాహకుల నుంచి ట్రోఫీ, ప్రశంసాపత్రాలు అందుకున్నారు. కోచ్‌లు అరవింద్, కల్యాణ్‌ను జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి రమాదేవి, ఏసీఎంవో ఉద్ధవ్ తదితరులు ప్రత్యేకంగా అభినందించారు.



ట్రోఫీ అందుకుంటున్న క్రీడాకారులు